జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 4 | జూన్ | 2026 • పేజీలు : 9

# ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్03, (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్‌డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎంల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీలో గోడౌన్ భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు,

మిగతా 2 లో...



# గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 03, (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, గ్రామాలు, వార్డుల స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టడం లక్ష్యంగా గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాలను నాలుగు క్లస్టర్లుగా, మున్సిపాలిటీల పరిధిలోని వార్డులను కూడా క్లస్టర్లుగా

మిగతా 2 లో...

# జాతీయ స్థాయిలో భద్రాచలం ఐటిడిఏకు అరుదైన గౌరవం




- దేశంలోని ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా ఐటిడిఏ పీవో బి. రాహుల్‌కు జాతీయ పురస్కారం
- ఐదు లక్షల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేత

**భద్రాచలం, జూన్ 3, ప్రజాజ్యోతి:** ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ ప్రాజెక్టు అధికారుల సదస్సులో భద్రాచలం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ దేశంలోని ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా ఎంపికై ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు.
ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి రంజనా చోప్రా చేతుల మీదుగా ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌తో పాటు సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్‌కు ఐదు లక్షల రూపాయల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలో

మిగతా 2 లో...

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెరగాలి

జిల్లా కలెక్టర్ అంకిత్



2 లో...

# సైకిల్ వినియోగంతో ఆరోగ్యం.. పర్యావరణానికి రక్షణ

- ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ
- ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం



**లక్ష్మీదేవి పల్లి, జూన్ 3 (ప్రజాజ్యోతి)** ఆరోగ్యవంతమైన జీవన విధానానికి, పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం ఎంతో దోహదపడుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కొత్తగూడెం విభాగ అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడెంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరుగుతున్న వాహనాల వినియోగం కారణంగా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం తీవ్రంగా పెరుగుతున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు

మిగతా 2 లో...

## గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

విభజించి ప్రణాళికాబద్ధంగా సభలను నిర్వహించాలని సూచించారు. గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజలకు వానాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, చెరువులు , జల వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటకం , సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి విధానం, ఎరువుల సమతుల వినియోగం, ఫార్మా రిజిస్ట్రేషన్, వానాకాల సాగుకు సంబంధించిన సూచనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా జనగణన కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని అన్నారు . అదేవిధంగా విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సభల్లో విస్తృతంగా వివరించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభలకు ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చూడాలన్నారు, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రామ, వార్డు సభలను సమర్థవంతమైన వేదికలుగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

## ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

వీవీప్యాట్ల భద్రతా పరిస్థితులను పరిశీలించారు.ముందుగా గోడౌన్ సీల్‌ను పరిశీలించిన కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారుల సమక్షంలో సీల్‌ను తెరిపించి గోడౌన్‌లోకి ప్రవేశించారు. అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన గదులను పరిశీలించి, తనిఖీ అనంతరం తిరిగి గోడౌన్‌కు సీల్ వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి అనుమతించరాదని సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బందికి ఆదేశించారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థను పరిశీలించారు. తనిఖీ అనంతరం గోడౌన్ తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్ అగర్వాల్, బిజెపి జె. మోహన కృష్ణ, టిఆర్ఎస్ అనుదీప్ ఎస్, అమ్ ఆద్మీ పార్టీ రాంబాబు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్, అశోక్,భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో భద్రాచలం ఐటిడిఏకు అరుదైన గౌరవం

(మొదటి పేజీ తరువాయి...)

గిరిజన మ్యూజియం ఏర్పాటు, భద్రగిరి మార్ట్ నిర్వహణ, ఉద్దీపకం కార్యక్రమం, విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం, ఇలవేల్పుల చరిత్ర పరిరక్షణ, క్రీడల ప్రోత్సాహం, గిరిజన సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వంటి పలు వినూత్న కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈ పురస్కారం లభించింది. కాగా, బి. రాహుల్ ఇప్పటికే ఉత్తమ ఎన్నికల నిర్వహణ విధానాల పురస్కారాన్ని రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా, ఉత్తమ గ్రామీణ పర్యాటక పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే ఆదివాసీ ఐక్య వేదిక తరఫున 'ఆదివాసీ వికాస రత్న' బిరుదుతో సత్కారం పొందారు.ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్న బి. రాహుల్, తాజాగా జాతీయ స్థాయిలో దేశంలోని ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా ఎంపికై పురస్కారం అందుకోవడం భద్రాచలం ఐటిడిఏతో పాటు జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది.

# సైకిల్ వినియోగంతో ఆరోగ్యం.. పర్యావరణానికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి...)

తోడ్పడవచ్చని అధికారులు తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడంలోను ప్రకృతి వనరుల సంరక్షణలోనూ సైకిల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

### ››› ఆరోగ్యానికి సైకిల్ ఉత్తమ సాధనం

నిత్య జీవితంలో సైకిల్‌ను భాగం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. ఆధునిక జీవనశైలిలో వ్యాయామానికి సమయం కేటాయించలేని వారు సైకిల్ వినియోగాన్ని అలవాటు చేసుకుంటే ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని సూచించారు.

### ››› పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత


భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. సైకిల్ వినియోగం ద్వారా కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు ప్రకృతిపై పడుతున్న భారం కూడా తగ్గుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు.

### ››› ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ మేనేజర్ విజయ భారతి, అన్నపురెడ్డిపల్లి ప్లాంటేషన్ మేనేజర్ గోపి ప్రసాద్, ఇంచార్జ్ ప్లాంటేషన్ మేనేజర్ నాగ లక్ష్మి , డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్స్ సుగుణ, స్వర్ణలత, అసిస్టెంట్ ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస రావుతో పాటు ప్లాంటేషన్ వాచర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ఇంధన పొదుపు వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెరగాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 03,(ప్రజాజ్యోతి)** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో వివిధ కోర్సుల వారీగా అందుబాటులో ఉన్న సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని, తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలుసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పరిశుభ్రతతో పాటు ఇతర కనీస మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నుండి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలు, ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో చేరేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, విద్యాశాఖ కోఆర్డినేటర్లు సైదులు, సతీష్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోలియా తండాలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కరెంటు స్తంభం

- అధికారులు నిర్లక్ష్యపు వైఖరి ఎందుకో..?





**టేకులపల్లి, జూన్ 03, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం గోలియా తండా గ్రామపంచాయతీ పరిధిలో ఓ బజారునా ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కరెంటు స్తంభం సమస్యపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని సీసీ రోడ్డుకు మధ్యలోనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయబడటం వల్ల ఇప్పటికే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆ స్తంభం వద్ద ఎర్త్ పవర్ లీకేజీ వస్తుండటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని స్థానికుల ఆరోపిస్తున్నారు.ఆ ప్రాంతంలో చిన్నపిల్లలు ప్రతి రోజూ ఆడుకుంటుండటంతో ఎప్పుడు ఏదైనా అపశృతి జరుగుతుందోనన్న భయం నెలకొంది. వర్షపు నీటితో కలిసిన విద్యుత్ ప్రవాహం వల్ల ఎవరైనా తాకితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోయాక స్పందిస్తారా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాన్ని సురక్షిత ప్రదేశానికి మార్చి, ఎర్త్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గ్రామస్తులు తెలిపారు.

## రైతుల సేవే సొసైటీ పాలకవర్గం లక్ష్యం

- పాల్వంచ సొసైటీ ద్వారా జిలుగులు విత్తనాల పంపిణీ ప్రారంభం



**పాల్వంచ, జూన్ 3, ప్రజాజ్యోతి:** రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే సొసైటీ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జిలుగులు (పచ్చిరొట్ట) విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలను అందించడంలో సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సొసైటీ ద్వారా మొత్తం 10 టన్నుల జిలుగులు విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులకు ప్రోత్సాహకంగా 50 శాతం సబ్సిడీపై 30 కిలోల బస్తాను రూ.2,452.75కు అందజేస్తున్నామని తెలిపారు. రెండున్నర ఎకరాలకు (ఒక హెక్టారుకు ) ఒక బస్తా చొప్పున పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు పొందాలనుకునే రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ ఆధారంగా వ్యవసాయ శాఖ నుంచి కూపన్ పొందాలని, అనంతరం సొసైటీ ద్వారా విత్తనాలు తీసుకోవచ్చని సూచించారు. రైతులు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్ధన్ రెడ్డి, జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, సీఈవో జి. లక్ష్మీనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.12 లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం చేసిన ఎమ్మెల్యే పాయం





**పినపాక,జూన్ 03(ప్రజాజ్యోతి):** చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పినపాక మండలంలోని సీతారాంపురం గ్రామపంచాయతీలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని స్థానిక సర్పంచ్ సనప అనితతో కలిసి పినపాక ఎమ్మెల్యే పాయం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు మహిళా, శిశు సంక్షేమ రంగాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామనాథం , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ రమేష్, సిడిపిఓ జయలక్ష్మి, స్థానిక అంగన్వాడి టీచర్ జయ, సర్పంచులు, ఉపసర్పంచులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెడికల్ ఫిట్ డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి

- కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఎఐటీయూసీ ధర్నా ముట్టడి



**కొత్తగూడెం, జూన్ 3 ( ప్రజాజ్యోతి )**సింగరేణి సంస్థలో మెడికల్ ఫిట్‌గా అర్హత సాధించిన డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారసులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ విధుల్లో ఉన్న సమయంలో అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర కారణాలతో ఉద్యోగాలను కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో డిపెండెంట్ ఉద్యోగ విధానం అమలులోకి వచ్చిందన్నారు. అయితే మెడికల్ పరీక్షల్లో అర్హత సాధించి అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకున్నప్పటికీ వందలాది మంది వారసులు నెలల తరబడి కొన్ని సందర్భాల్లో సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం కారణంగా అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కుటుంబ పోషణ, పిల్లల విద్య, వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారిందన్నారు. కార్మిక కుటుంబాల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి మెడికల్ ఫిట్ డిపెండెంట్లందరికీ వెంటనే నియామక పత్రాలు అందజేయాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి అభివృద్ధి, లాభాల సాధనలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అలాంటి కార్మికుల కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం నాయకులు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని జీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, హుమాయూన్, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, కమల్, సౌజన్య, సీనియర్ నాయకులు మండల రాజేశ్వరరావు, సురేందర్, మాచర్ల శ్రీనివాస్, కొవ్వూరి రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, అప్పారావు, శశివర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై పంచాయతీ ఫోకస్

- పారిశుద్ధ్యంపై పంచాయతీ ప్రత్యేక దృష్టి






**చర్ల, జూన్ 03:(ప్రజాజ్యోతి):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను బుధవారం గ్రామ సర్పంచ్ సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు పర్యవేక్షణలో డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ, ప్రధాన రహదారులు, వీధుల వెంట పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగిస్తున్నారు. వర్షాకాలంలో దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు కార్యదర్శి బి. రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇంటి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ నిబంధనలను పాటించాలని ప్రజలకు సూచించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు పంచాయతీ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగితే గ్రామం మరింత పరిశుభ్రంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

## తెలుగు భాషా వైభవం చాటేలా ప్రపంచ సాహితీ మహాసభలు

- గోడపత్రికలను ఆవిష్కరించిన భద్రాచలం డీఎస్పీ ఎం.అరుణ్‌కుమార్



**భద్రాచలం టౌన్, జూన్ 3 ప్రజాజ్యోతి** తెలుగు సాహిత్య, సాంస్కృతిక చైతన్యాన్ని వెలికితీయడంలో ప్రపంచ తెలుగు సాహితీ మహాసభలు కీలక పాత్ర పోషిస్తాయని భద్రాచలం డీఎస్పీ ఎం.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో రాజమండ్రిలోని గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా జరగనున్న '7వ ప్రపంచ తెలుగు సాహితీ మహాసభల' గోడపత్రికలను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తెలుగు జాతి వైభవాన్ని కాపాడటంతో పాటు, మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి సభలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలు దిగ్విజయంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. 5 వేల మంది సాహితీవేత్తల రాక ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రపంచ తెలుగు మహాసభల సమన్వయకర్త, స్వర్ణ నంది గ్రహీత సురేష్ బాబు, తోటమల్ల మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభలకు దేశ విదేశాల నుండి సుమారు ఐదు వేల మంది కవులు, రచయితలు, కళాకారులు మరియు సాహితీవేత్తలు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, అధ్యాపకులు అర్జా భిక్షం రావు, బద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్రతిభకు నగదు పురస్కారం

- రాష్ట్ర ర్యాంకర్ కు ప్రకృతి వాకర్స్ చేయూత



**చర్ల, జూన్ 03 :(ప్రజాజ్యోతి):** విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో విజయవాడకు చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ 'ప్రకృతి వాకర్స్ టీమ్' గురుదేవ్ విద్యాలయానికి చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని బి. మాధురికి రూ.10,000 నగదు పురస్కారాన్ని అందజేసింది. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించిన మాధురి, టీజీ ఆర్జేసీ సెట్  లో రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా బుధవారం గురుదేవ్ విద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థినిని ఘనంగా సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. విజయవాడకు చెందిన ప్రకృతి వాకర్స్ టీమ్ సభ్యులు ప్రతి నెలా తలా రూ.100 చొప్పున పొదుపు చేసి, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ ఏడాది మాధురి ప్రతిభను గుర్తించిన టీమ్ సభ్యురాలు శ్రీమతి పరుచూరి శ్రీలక్ష్మి, ఆమె భర్త శ్రీ పరుచూరి మనోహర్ ప్రసాద్ సహకారంతో ఈ పురస్కారానికి మాధురిని ఎంపిక చేశారు. విద్యార్థినికి ఈ నగదు బహుమతి అందించడంలో కృషి చేసిన సామాజిక కార్యకర్త వేములపల్లి ప్రవీణ్  ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. మాధురి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న ప్రకృతి వాకర్స్ టీమ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పరిటాల వెంకటరమణ, సామాజిక సేవా కార్యకర్త వి. ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు  గిరి, అకడమిక్ కో–ఆర్డినేటర్లు ఎం.వి. సుబ్రహ్మణ్యం, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు న్యాయం చేయాలి

- బిఆర్ఎస్ కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, జూన్ 03 (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు మార్పు కోసం కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే, అదే ప్రభుత్వం ఇప్పుడు వారినే మోసం చేస్తోందని విమర్శించారు.ఎన్నికల సమయంలో పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా వాటి అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులు అడగని ఈహెచ్ఎస్ (ఎంప్లాయీ హెల్త్ స్కీమ్) పేరుతో వారి జీతాల నుంచి కోతలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు.ఈహెచ్ఎస్ అమలు విషయంలో ఉద్యోగులకు పూర్తి వివరాలు తెలియజేయకుండా, హెల్త్ కార్డులు కూడా అందజేయకుండానే జీతాల నుంచి కోతలు విధించారని ఆరోపించారు. జూన్ నెల నుంచి కోతలు ఉంటాయని ప్రకటించిన ప్రభుత్వం మే నెల జీతాల నుంచే డబ్బులు కట్ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులుగా ఉన్న కుటుంబాల్లో ఇద్దరి జీతాల నుంచీ కోతలు విధించడం సరి కాదన్నారు.రిటైర్డ్ ఉద్యోగులకు 100 రోజుల్లో పెన్షన్ బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదని, ఇప్పటి వరకు చాలా మంది పెన్షనర్లకు ప్రయోజనాలు అందలేదని విమర్శించారు.ఉద్యోగ సంఘాల నాయకులు పీఆర్సీ, డీఏల అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని దొడ్డి తాతారావు కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై ఉద్యోగులు, పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## గాలివానతో కూలిన చెట్ల తొలగింపు

- ఉప్పరిగూడెంలో పంచాయతీ సిబ్బంది తక్షణ చర్యలు





**చర్ల,జూన్ 03: (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం కురిసిన గాలివాన కారణంగా ఉప్పరిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి కూలిన చెట్లను తొలగించి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.గాలివాన ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది అవసరమైన చర్యలు చేపట్టారు.బుధవారం గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ సర్పంచ్ సోయం నాగలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు . పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇల్లందు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

- మున్సిపాలిటీకి భారీ నిధులు తెచ్చేందుకు ప్రయత్నాలు
- మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలి
- మంత్రి, రాజ్యసభ సభ్యులను కలిసి వినతి పత్రం అందజేత



**ఇల్లందు, జూన్ 3, ప్రజాజ్యోతి:** ఇల్లందు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, పురపాలక సంఘ బలోపేతం, మృత ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మరోసారి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి లను కలిసి ఇల్లందు మున్సిపల్ అభివృద్ధికి అత్యవసరంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఇల్లందు పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ఇల్లందు పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఆరుగురు ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఇల్లందు ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ నిధులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పురపాలక సేవలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, 20వ వార్డు కౌన్సిలర్ యండి జాఫర్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలను బలికొన్న విద్యుత్ తీగలు

- మేతకు వెళ్లి తిరిగిరాని అనంత లోకాలకు మూగజీవాలు
- దుక్కి ఆవులు కావడంతో లబోదిబో మంటున్న రైతులు







**టేకులపల్లి,జూన్03,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామపంచాయతీ, కొండగలబోడు గ్రామానికి చెందిన ఐదుగురు రైతుల పశువులు ఉదయం మేతకు వెళ్లిన గాలి దుమారానికి గ్రామ పరిధిలో వీరయ్య అనే రైతు పొలంలో కిందపడ్డ స్తంభం తీగల విద్యుత్ ఘాతంతో మృతి ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొండగులపాడు గ్రామానికి చెందిన పశువులు ఐదుగురు రైతుల వివరాలు జర్పుల భాస్కర్ కు చెందిన ఒక ఆవు, జర్పుల రవి కి చెందిన ఒక ఆవు, కేలోత్ వీరన్న కు చెందిన ఒక ఆవు, భూక్య బాలాజీ కు చెందిన ఒక ఆవు, భూక్య బద్రు కు చెందిన ఒక ఆవు మృతి చెందాయి.ఈ మూగజీవాలు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే దుక్కి దున్నే ఆవులు మృతి చెందడంతో వ్యవసాయ కాలం దగ్గర పడటంతో రైతులు కన్నీరుగా విద్యుత్ శాఖ స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు వాబోతున్నారు.

### ››› వెటర్నరీ డాక్టర్ వివరణ:

మృతి చెందిన ఐదు జీవాల మరణం పై పంచనామా నిర్వహించినట్లు వైద్య పరీక్షలు రిపోర్టు పై అధికారులకు పంచనామా పత్రాలను సబ్మిట్ చేయనట్టు ఆయన తెలిపారు.

## నూతన పంచాయతీ కార్యాలయం ప్రారంభం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**చర్ల, జూన్ 03 : (ప్రజాజ్యోతి ):** చర్ల మండలం కొయ్యూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవల అందించడంలో గ్రామపంచాయతీ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయ భవనాన్ని పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించడంలో ఈ కార్యాలయం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామ ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట అందుబాటులో ఉండేలా గ్రామపంచాయతీ కార్యాలయాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి వార్తతో కదిలిన అధికారులు

- స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాంబాబు
- తెరుచుకున్న పల్లె ప్రకృతి వనం



**చర్ల, జూన్ 03 :(ప్రజాజ్యోతి):** చర్ల గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం గత కొన్ని రోజులుగా మూతపడడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయం తెలిసిందే. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, వ్యాయామం, స్వచ్ఛమైన వాతావరణంలో కొంత సమయం గడిపేందుకు వచ్చే ప్రజలకు ఈ వనం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే గత కొన్ని రోజులుగా వనం గేట్లు మూసివేయబడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై "మూతబడిన పల్లె ప్రకృతి వనం..! అనే శీర్షికతో ప్రజాజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన గ్రామపంచాయతీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పల్లె ప్రకృతి వనాన్ని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఇటీవల చర్ల గ్రామపంచాయతీలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు బుధవారం పల్లె ప్రకృతి వనాన్ని స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. వనం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, కలుపు మొక్కలు, ఎండిపోతున్న మొక్కలు, మూసివేసిన గేట్ల పరిస్థితిని గమనించి వెంటనే పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించి వనాన్ని శుభ్రపరిచే పనులను ప్రారంభించారు . ఉదయం వేళల్లో వాకింగ్ చేసే వారు, సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో గడపాలనుకునే వారు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఈ వనాన్ని విస్తృతంగా వినియోగించేవారు. కానీ నిర్వహణ లోపం కారణంగా వనం క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. గేట్లు మూసివేయబడటంతో పాటు మొక్కలకు నీరు అందక కొన్ని మొక్కలు ఎండిపోవడం, వనం ఆవరణలో చెత్త పేరుకుపోవడం, కలుపు మొక్కలు పెరగడం వంటి సమస్యలు తలెత్తాయి.

> ››› ప్రజాజ్యోతి కథనం ప్రచురితమైన వెంటనే అధికారులు స్పందించారు...

ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు మాట్లాడుతూ, పల్లె ప్రకృతి వనం గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే ముఖ్యమైన ప్రదేశమని తెలిపారు. వనం నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇకపై ప్రతిరోజూ వనాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు పారిశుద్ధ్యం, మొక్కల సంరక్షణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. వనాన్ని సందర్శించే ప్రజలు కూడా పరిశుభ్రతను పాటిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు.పల్లె ప్రకృతి వనంలో శుభ్రత పనులు చేపట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజాజ్యోతి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శి రాంబాబు, పంచాయతీ సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో కూడా పల్లె ప్రకృతి వనాన్ని నిరంతరం తెరిచి ఉంచడంతో పాటు మొక్కల సంరక్షణ, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


ప్రజాజ్యోతి

మూతపడిన పల్లె ప్రకృతి వనం...!

# పోలవరం బ్యాక్వాటర్ ప్రభావంతో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల ప్రజలకు ముప్పు

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందానికి బూర్గంపహాడ్, అశ్వాపురం బీఆర్ఎస్ నేతల వినతి



**బూర్గంపహాడ్, జూన్ 3 (ప్రజా జ్యోతి):**పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం, పినపాక నియోజకవర్గం ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని... 86లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సంభవిస్తే పోలవరం బ్యాక్ వాటర్తో ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు, వ్యవసాయభూములు, ప్రభుత్వ, జాతీయ ప్రాధాన్యత సంస్థలకు తీవ్రనష్టం ఏర్పడే అవకాశం ఉందని గురువారం సారపాక ఐటీసీ అతిథిగృహానికి చేరుకున్న పోలవరం అథారిటీ బృందాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నాయకులు కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు 12 అంశాలతో కూడిన లేఖను వారికి అందించి ఆ లేఖలోని ప్రధాన డిమాండ్లను తెలంగాణ ప్రజల హక్కులు, భద్రత, భవిష్యత్తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలుచేయాలని కోరారు. ప్రధానంగా సమగ్ర బ్యాక్ వాటర్ అధ్యయనాన్ని తక్షణం నిర్వహించాలని, 36 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద ప్రవాహాన్ని ప్రామాణికంగా తీసుకుని స్వతంత్ర జాతీయ లేదా అంతర్జాతీయ నిపుణ సంస్థలతో కొత్త బ్యాక్ వాటర్ అధ్యయనం నిర్వహించి ఆ అధ్యయన నివేదిక పారదర్శకతతో ప్రజల ముందుంచాలని, తెలంగాణ ముంపు గ్రామాలకు ప్రత్యేక ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని, ప్రతి ముంపుబాధిత కుటుంబానికి ఏపీలో అమలవుతున్న ప్యాకేజీతో సమానంగా లేదా అంతకంటే మెరుగైన పునరావాస, పునఃనిర్మాణ ప్యాకేజీని కేంద్రం ద్వారా అమలుచేయాలని, భూములు కోల్పోయిన రైతులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు ప్రత్యేక పరిహారం ఉండాలని, పోలవరం ఆపరేషనల్ రూల్ కర్వను సవరించాలని, వరదకాలంలో ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టాన్ని నిల్వచేయకుండా రన్ ఆఫ్ ద రివర్ విధానం అమలుచేయాలని, జూలై నుంచి ఆగస్టు వరకు అవసరమైన సమయంలో గేట్లు ఎత్తి వరదనీటి ప్రవాహాన్ని నిరాటంకంగా దిగువకు విడుదల చేయాలని, పోలవరం డిజైన్, స్పిల్ వే సామర్థ్యం పునఃసమీక్షించాలని, కిన్నెరసాని, ముర్రేడు వాగులపై ప్రత్యేక అధ్యయనం చేయాలని, భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు పినపాక నియోజకవర్గంలో కొత్త ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని, పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా నియోజకవర్గంలోని బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలు తీరమండలాలు కావడంతో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, గ్రామాల్లో వ్యవసాయ భూములు, ప్రజల ఆస్తుల రక్షణ కోసం కొత్తగా రక్షణ గోడలు పోలవరం ప్రాజెక్టు వ్యయంతో నిర్మించాలని, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ కు ప్రత్యేక భద్రత కల్పించాలని, భద్రాచలం డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, గోదావరిలో భారీస్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపట్టడంతో పాటు తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అమలు అమలుచేయవద్దనే డిమాండ్లతో రక్షణ చర్యలన్నింటినీ పోలవరం ప్రాజెక్టు కాంపోనెంట్లలో చేర్చాలని పీపీఏకు విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, కోడి అమరేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు వెన్న అశోక్ కుమార్, కంచుగట్ల వీరభద్రం, గౌర్రెముచ్చు వెంకటరమణ, శివార పు డా క్టర్ బాబు, బూర్గంపహాడ్ మండల నాయకులు కర్రి నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బొబ్బిలి, దాసు, గోపికృష్ణ, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# టీకాకరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- సుజాతనగర్ పీహెచ్‌సీ పరిధిలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పరిశీలన



**సుజాతనగర్, జూన్ 3 ( ప్రజాజ్యోతి )**చిన్నారులు, గర్భిణీలకు నిర్దేశిత సమయానికి టీకాలు అం దేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు బుధవారం ఆయన సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సాధారణ టీకాకరణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా సింగభూపాలెం, పాత అంజనాపురం, సర్వారం ఆరోగ్య ఉపకేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకాకరణ కార్యక్రమాలను పరిశీలించి లబ్ధిదారుల హాజరు, వ్యాక్సిన్ నిల్వలు, రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయి సేవల అమలును సమీక్షించారు. టీకాకరణ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాలని అర్హులైన ప్రతి గర్భిణీ, చిన్నారికి టీకాలు అందేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం, అతిసార నివారణ ప్రత్యేక ప్రచార కార్యక్రమం, జాతీయ క్రిమి నివారణ దినోత్సవం, ఎంఆర్ నిర్మూలన కార్యక్రమాలపై వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు లబ్ధిదారుల గుర్తింపు, ప్రజల్లో అవగాహన కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి నాగభూషణం పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై అటవీశాఖ బైక్ ర్యాలీ




**పినపాక,జూన్ 03(ప్రజాజ్యోతి):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ–బయ్యారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత తెలిపారు.అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఈ–బయ్యారం క్రాస్ రోడ్ వరకు, అక్కడి నుంచి ఉప్పాక బ్రిడ్జి వరకు, అనంతరం పినపాక జూనియర్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగించామని తెలిపారు. ర్యాలీ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వృక్ష సంపద పెంపుదలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులు ప్రకృతి సమతుల్యతకు మూలాధారమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అటవీ సంపదను కాపాడటం ద్వారా వన్యప్రాణులు, జీవ వైవిధ్యం రక్షించబడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మాధవి, వెంకటేశ్వర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీకి స్థానిక ప్రజలు కూడా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అటవిశాఖ సిబ్బంది, ఎఫ్బీఓ లు పాల్గొన్నారు.

## సివిక్ యాక్షన్ కార్యక్రమం

- 150 మంది లబ్ధిదారులకు సీఆర్‌పీఎఫ్ చేయూత







**చర్ల ,జూన్ 03: (ప్రజాజ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ సెక్టార్ ఐజీ శ్రీ శాలిన్, కోటా రేంజ్ డీఐజీ శ్రీ రాజేష్ పాండే మార్గదర్శకత్వంలో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని టిప్పాపురం, గోరకుండ, తోగ్గుడా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని 218 బెటాలియన్ కమాండెంట్ శ్రీ మహమ్మద్ ఖాలిద్ ఖాన్, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది పేద, నిరుపేద, అవసరమైన గ్రామీణులకు వివిధ రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కుట్టు మిషన్లు, చీరలు, లుంగీలు, తువ్వాళ్లు, చెప్పులు, దోమతెరలు, పారలు, గడ్డపారలు, సోలార్ లాంతర్లు, గొడుగులు, వాటర్ డ్రమ్ములు, ప్లేట్లు, గ్లాసులు, వంట పాత్రలు, డెక్సాలు, పరాతలు తదితర వస్తువులను అందజేశారు.అలాగే విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్సిల్ బాక్సులను పంపిణీ చేశారు. క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో క్రికెట్ కిట్లు, వాలీబాల్ సెట్లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 150 మంది గ్రామీణులు లబ్ధి పొందారు.ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించేందుకు సివిక్ యాక్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలతో భద్రతా బలగాల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ సునీల్ కుమార్, ఇన్‌స్పెక్టర్/జీడీ నితేష్ కుమార్ నాయకత్వంలోని సి/218 బెటాలియన్, ఎఫ్/218 బెటాలియన్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు సీఆర్‌పీఎఫ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుడ్ షెఫర్డ్ సేవలు అభినందనీయం: సర్పంచ్ విజయ





**ములకలపల్లి, జూన్ 3 ప్రజాజ్యోతి :** మండలంలోని రాసన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీలకు గుడ్ షెఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాసన్నగూడెం సర్పంచ్ విజయ ముఖ్య అతిథిగా హాజరై, ఆమె చేతుల మీదుగా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గుడ్ షెఫర్డ్ సంస్థ చేపడుతున్న స్వచ్ఛంద సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వలస ఆదివాసీలకు అవసరమైన నిత్యావసర సరుకులను అందించడం ద్వారా వారికి కొంత మేర ఉపశమనం కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ ఉదయ, దీప్తి, బెనోసియా, పొడియం శ్రీరాములు, సుజాత, నాగరాజు, బాలరాజు, అంగన్‌వాడీ టీచర్ కరుణ తదితరులు పాల్గొన్నారు

# వామ్మో... జూన్ ..!

- ప్రారంభం కానున్న పాఠశాలలు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైన గుబులు!
- ప్రైవేట్ పైనే మక్కువ!
- అధిక ఫీజులతో అతలాకుతలం
- నియంత్రణ లేని ఫీజులు? ఈసారైనా ఫీజులకు ప్రభుత్వం అడ్డుక ట్టవేసేనా?
- పుస్తకాలు, డ్రెస్సులు, షూస్ లతో ఆర్థిక భారం!



**ఇల్లందు, జూన్ 3, ప్రజాజ్యోతి:** బడులు తెరుచుకోనున్నాయి. ఈ వార్త విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతుంది. జూన్ మాసం వస్తుందంటేనే తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయలేక ఇబ్బందులు పడుతుంటారు. అప్పుడే విద్యార్థుల ఫీజులు కట్టే సమయం వచ్చిందా అంటూ ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, షూస్, ఇతర సామాగ్రి కొనుగోలు విషయాల్లో ఆందోళన చెందుతుంటారు. ఇటీవలే వార్షిక పరీక్షల ఫీజుతో భారం మోయగా, ఇప్పుడు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

### ››› ప్రైవేట్ పైనే మక్కువ... ఇదే ఫీజులకు ఆసరా

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక కల్పించకపోవడం, ఉపాధ్యాయుల కొరత తీర్చకపోవడం వంటి కారణాలతో పాటు కొందరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండడం కారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో విద్యార్థుల దురభిప్రాయం ఏర్పడింది. ఇక బాలికలకు ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో సరైన సదుపాయాలు కల్పించరనే అపోహ కూడా ఉండడం కారణంగా బాలికలను ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆర్థికంగా ఉన్న వారితో పాటు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద వర్గాలు కూడా ప్రైవేటు పాఠశాలల్లో విద్య నభ్యసిస్తే తమ పిల్లలు వృద్ధిలోకి వస్తారనే ఆశతో ఎంత కష్టమైనా భరించి వారిని ప్రైవేట్ ప్రైవేట్ లో చేర్పించడం జరుగుతుంది. ఇక్కడే ప్రైవేట్ పాఠశాలలు అన్ని అవకాశాలను ఉప యోగించుకొని ప్రతి ఏటా ఫీజులను పెంచుతూపోతున్నాయి. భద్రాద్రి జిల్లాలో ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో ఏదో కొత్తదనమంటూ ఫీజులను పెంచేస్తున్నారని తెలుస్తుంది. పాఠశాలల మధ్య ఎంత పోటీ ఉన్నా ఫీజుల విషయంలో మాత్రం అందరూ కఠినంగానే వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను అడ్డగోలుగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం మోగుతున్నాయనే అపవాదు లేకపోలేదు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో తల్లిదండ్రుల ఖజానాను ఖాళీ చేస్తున్నాయి.

### ››› నియంత్రణ లేని ఫీజులు..

జూన్ మాసం రాకమునుపే ఆయా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు, డొనేషన్ల దందా విచ్చలవిడిగా నడు స్తుందనేది పక్కా సమాచారం. ముందస్తు ప్రచారం, అడ్మిషన్ల పేరిట తల్లిదండ్రుల వద్ద దోచుకో వద్దని ప్రభుత్వం చెబుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు పెడచెవిన పెడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని విని యోగించుకొని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ ను ప్రతి సంవత్సరం పోతున్నాయి. ఇక ఆయా పాఠశాలలకు తోక పేర్లను తగిలించుకొని తమ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉందని ప్రత్యేక తర్ఫీదు పొందిన ఉపాధ్యాయ బృందం ఉందని స్పెషల్ క్లాస్ లు ఉంటాయని తల్లిదండ్రులను బురిడి కొట్టించి అందినకాడికి లాగు తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. టెక్నో, గ్లామర్, మోడల్, డీజీ, కాన్సెప్ట్ వంటి తోక పేర్లు తగిలించుకొని ప్రత్యేక ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆపవాదు ఉంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కానీ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తూ దోచుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డు, అదుపు లేని ఫీజుల వసూళ్లతో విద్యార్థుల తల్లిదండ్రులు మోయలేని భారంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం ఇంకా కఠినంగా ఫీజుల నియంత్రణ విషయంలో చట్టం తీసుకురావాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› పుస్తకాల ధరలు ఆకాశంలో..

ప్రైవేటు పాఠశాలలో ఉపయోగిస్తున్న పుస్తకాలకు సంబంధించి ధరలుచూస్తే విస్తుపోవాల్సిందే. గతేడాది నర్సరీ, యూకేజీ, ఎల్ కేజీ చదివే పిల్లలకు రూ. 3వేల లోపే పుస్తకాలు, నోట్స్ లు వచ్చేవి. రూ. 3వేలకు తగ్గకుండా పుస్తకాలు, నోట్ పుస్తకాలు తీసుకున్నారు. ఈసారి అవి అమాంతం పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుత మార్కెట్ లో పేపర్ ధర రెట్టింపు కావడంతో ఈ విద్యా సంవత్సరం పుస్తకాలు, నోట్ పుస్తకాల ధరలు అమాంతం పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే కొన్ని పాఠశాలల యాజమాన్యాలు మాత్రం పుస్తకాలు, నోటు పుస్తకాలను తమ పాఠశాలల్లోనే కొనాలని నిబంధనలు విధిస్తున్నాయని సమాచారం. మరి కొన్ని పాఠశాలలు కొన్ని బుక్ స్టాల్ లలో తమ పాఠశాలలకు చెందిన పుస్తకాలు, నోట్స్ లు, మెటీరియల్ కొనుగోలు చేయాలని చెబుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులకు ఇచ్చిన వచ్చిన బుక్ స్టాల్స్ లలో కొనుగోలు చేస్తే ఎంతో కొంత బేరం ఆడితే రేట్లను కొంతైనా తగ్గించే వారని పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన బుక్ స్టాల్స్ లలో కొనుగోలు చేస్తే వ అడిగినంత ఇవ్వాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది కూడా తమకు మోయలేని ఆర్థిక భారమేనని ఆందోళన చెందుతున్నారు.

### ››› బ్యాగులు, షూస్ అన్ని భారమే..

విద్యా సంవత్సరం మార్కెట్ లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్ ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడం తల్లిదండ్రులకు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటుంటే తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదన్న భావనతో తమ ఆర్థిక పరిస్థితి అంతగా లేకున్నా ఋణమో, తృణమో తెచ్చి తమ పిల్లలకు తల్లిదండ్రులు అన్ని రకాల వస్తువులను సమకూరుస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మార్కెట్ లో అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రులు మరింత ఆర్థిక భారం కానుంది. ఏది ఏమైనా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం మరింత కఠినంగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.





## మాతా-శిశు ఆసుపత్రిలో

# గందరగోళం..!

- కష్టాల నిలయంగా మారిన కోట్ల రూపాయల భవనం
- నీళ్లు లేవు.. వైద్యులు లేరు.. రోగుల విలవిల
- పారిశుధ్యం గాలికొదిలి.. మరుగుదొడ్లు దుర్గంధంగా..!
- రాజకీయ జోక్యంతో ఆసుపత్రి వ్యవస్థ అస్తవ్యస్తం..?
- డీఎంహెచ్‌వో పర్యవేక్షణ ఎక్కడ..?





**కొత్తగూడెం, జూన్ 3 ( ప్రజాజ్యోతి )** జిల్లాలో వేలాది మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందిస్తున్న మాతా–శిశు జిల్లా ఆసుపత్రి ప్రస్తుతం తీవ్ర గందరగోళ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఆసుపత్రిలోనే నీటి కొరత, పరిశుభ్రత లోపం, సిబ్బంది కొరత, రాజకీయ జోక్యం వంటి సమస్యలు తలెత్తడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు వాపోతున్నారు. వేసవికాలంలో ఆసుపత్రిలో తాగునీరు, వినియోగ నీటి కొరత తీవ్రంగా



కనిపిస్తోందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ వైద్యుల సంఖ్య తగినంతగా లేకపోవడం వల్ల గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఆసుపత్రిలో సమయపాలన పాటించని కొందరు వైద్యులు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పరిపాలనా వ్యవస్థ కారణంగా రోగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగుల సమస్యలను పరిష్కరించాల్సిన యంత్రాంగం స్పందించకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారని తక్కువ వేతనాలతో అధిక పనిభారం మోపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో కార్మికుల జీవన పరిస్థితులు దయనీయంగా మారాయని తెలుస్తోంది. మరోవైపు ఆసుపత్రిలో ఉద్యోగ నియామకాలు, కాంట్రాక్టు పనుల విషయంలో స్థానిక రాజకీయ నాయకుల ప్రభావం అధికంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది కూడా కొందరు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆసుపత్రి మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందని రోగులు చెబుతున్నారు. పరిశుభ్రత లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని సంక్రమణ వ్యాధుల ప్రమాదం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు కావడంతో పాటు వాటి నిర్వహణ కూడా వివాదాలకు దారి తీస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆసుపత్రి వద్ద ఆటో రవాణా వ్యవస్థ కూడా ప్రయాణికులకు భారంగా మారిందనే ఫిర్యాదులు ఉన్నాయి. ప్రయాణికుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఇతర ఆటోలను అనుమతించకుండా కొందరు యూనియన్ సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్ని సమస్యలు వరుసగా వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, ముఖ్యంగా డీఎంహెచ్‌వో కార్యాలయం స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అత్యంత కీలకమైన మాతా–శిశు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

### ››› ప్రసూతుల ప్రాణాలతో చెలగాటమా..?

జిల్లాలోని మాతా–శిశు ఆసుపత్రి ప్రసూతులు, బాలింతలకు భరోసా కల్పించాల్సిన కేంద్రంగా ఉండగా ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో సక్రమమైన నిర్వహణ లేకపోవడం కనీస సౌకర్యాలు అందకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రసూతుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆసుపత్రిలో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ››› నీళ్లు లేవు.. పరిశుభ్రత లేదు.. పర్యవేక్షణ కరువు..!

కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ ఆసుపత్రిలో తాగునీటి సమస్య తలెత్తడం పలు అనుమానాలకు తావిస్తోంది. పరిశుభ్రత విషయంలోనూ పరిస్థితి అధ్వాన్నంగా మారిందని రోగులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పారిశుధ్య లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› రాజకీయ జోక్యంతో దెబ్బతింటున్న ఆసుపత్రి పరిపాలన

మాతా–శిశు ఆసుపత్రి నిర్వహణలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో పరిపాలన గాడితప్పుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. శానిటేషన్ కార్మికుల నియామకాల నుంచి ఇతర ఉద్యోగాల వరకు రాజకీయ నాయకుల సిఫార్సులే కీలకంగా మారాయనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో అత్యంత కీలకమైన వైద్య సంస్థగా పేరున్న ఈ ఆసుపత్రి పనితీరు మాత్రం అందుకు తగ్గట్టుగా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై విశ్వాసం తగ్గిపోవడంతో పేద కుటుంబాలు కూడా ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



## నాణ్యతలేని విత్తనాలు, పురుగు మందులు అమ్మే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

సేవాలాల్ సేన రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ



**టేకులపల్లి, జూన్ 03, ప్రజాజ్యోతి:** నాణ్యతలేని విత్తనాలు, పురుగుమందులు విక్రయాలను నిర్వహించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సేవాలాల్ సేన రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణా నాయక్ కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసే వ్యాపారులపై వెంటనే కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతే రాజు అని ప్రభుత్వం ప్రతి సమావేశంలో చెబుతున్నప్పటికీ, రైతులు మాత్రం ప్రతి ఏడాది పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నాణ్యతలేని విత్తనాలు, నకిలీ పురుగుమందుల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇకపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మే ప్రతి షాపులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వం అని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి మండల పరిధిలోని దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. నాణ్యతలేని గింజలు, మందులు విక్రయించినట్లు తేలితే ప్రజలతో కలిసి రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి ఆ దుకాణం యజమాని పై కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. దేశ ప్రజలందరికీ అన్నం పెట్టే రైతును మోసం చేయడం అత్యంత దుర్మార్గమైన పని అని అన్నారు. రైతు బతికితేనే దేశం బతుకుతుంది అని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు పూర్తిగా పరిశీలించి, నాణ్యత ఉన్నవే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ నాయక్, నరేష్ నాయక్, కిషన్ నాయక్, హథీరామ్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు, వాకర్స్‌కు తాగునీటి సౌకర్యం

- విద్యుత్ కళాభారతి మైదానంలో బోరు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి



**పాల్వంచ, జూన్ 3, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని 4వ డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ కళాభారతి మైదానంలో క్రీడాకారులు, వాకర్స్‌కు ఉపయోగపడేలా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు 4వ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి బోరు వేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మైదానానికి ప్రతిరోజూ వచ్చే క్రీడాకారులు, వాకర్స్ తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఏడీఈ వేణుగోపాల్, చెరుకు అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడవల్లి కృష్ణతో పాటు పలువురు క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు. బోరు ఏర్పాటు చేసినందుకు క్రీడాకారులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు..

## ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- ముస్లిం పెద్దలు యువకుల సమక్షంలో ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం.





**అశ్వాపురం, జూన్ 3, ప్రజా జ్యోతి పత్రిక** (అశ్వాపురం మండల కేంద్రంలోని ఈద్గా ప్రాంగణంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, యువకులు మరియు గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనల నడుమ ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం మరియు ప్రార్థనా స్థలాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముస్లిం సోదరుల విజ్ఞప్తి మేరకు ఈద్గా ప్రాంగణ అభివృద్ధి కోసం రూ.15 లక్షల నిధులు మంజూరు చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించడం సంతోషకర విషయమన్నారు. ఈ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయిన అనంతరం ఈద్గా ప్రాంగణానికి రక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని మతాల ప్రార్థనా స్థలాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మత సామరస్యం, సామాజిక ఐక్యతను కాపాడుతూ ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి అశ్వాపురం మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ITDA E.E., A.E. ఐవీ ఎన్ ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎం.పీ. సూపరింటెండెంట్ పిచ్చేశ్వరరావు, జీపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి యాకుబ్ పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు బానోతు సదర్లాల్, యేనిక ఉషారాణి, సప్కా పిచ్చయ్య, కొర్సా కృష్ణ, కుంజా జాను, ఎట్టి నరేష్, ఉపసర్పంచ్‌లు తుళ్ళూరి ప్రకాష్ రావు (టీడీపీ), మేకల అంజిబాబు, నాయకులు వేములపల్లి రమేష్, లంకమల్ల కొండలరావు, చుంచు ఏకాంబరం, మాదినేని రాంబాబు, సోడే వెంకటేశ్వర్లు, ఏనిక రవి, ఎం.డి. షర్ఫుద్దీన్, తెల్లం వీరభద్రం, ఎస్.కే. ఖదీర్, తెల్లం నాగరాజు, రావులపల్లి నరసింహారావు, వేముల విజయ్, కోలా శశికాంత్, బట్టి వెంకన్న, తాటి రాంబాబు, కురం నరసింహారావు, తాటి శ్రీను, తాటి జంపయ్య, దారపు శ్రీను, జిన్నేక నాగయ్య, అద్దంకి బాలాజీ, కమ్మని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ముస్లిం సోదరులు ఎస్.కే. శబ్బీర్, ఆలీ, ఖురేషి, సాదిక్ పాషా, సి. హుస్సేన్, ఎస్.కే. గాలిబ్, ఎస్.డి. సర్వర్, ఎస్.కే. మున్నీర్, అబ్దుల్ బారి, ఎం.డి. షఫీ, ఎస్.కే. ఖాజా, ఎస్.కే. భాషా, ఎస్.కే. మదహర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కమిషన్ కక్కుర్తి... ఖాతాలపై సైబర్ కత్తి !!

- కమిషన్ ఎరతో అమాయకుల ఖాతాలపై సైబర్ ముఠాల గురి
- పెట్రోల్ బంకులు, దుకాణాల సిబ్బందే కొత్త టార్గెట్
- 'క్యాష్ అవుట్' పేరుతో జిల్లాలో విస్తరిస్తున్న మోసాల వల




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రజా జ్యోతి):** మీ ఖాతాలోకి డబ్బు పడుతుంది... మీరు నగదు ఇస్తే చాలు... మీకు కమిషన్ కూడా ఉంటుంది అనే మాయమాటలు ఇప్పుడు చాలామందిని కష్టాల్లోకి నెడుతున్నాయి. కొద్దిపాటి అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో అపరిచితుల కోసం లావాదేవీలు నిర్వహించిన ఉద్యోగులు, వ్యాపారులు ఇప్పుడు బ్యాంకులు, పోలీస్ స్టేషన్లు, సైబర్ క్రైమ్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో అమాయకుల బ్యాంకు ఖాతాలను వేదికగా చేసుకొని మోసాలకు పాల్పడుతుండటంతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

### ♦ కమిషన్ ఆశ... కష్టాల పాశం

రోజువారీగా నగదు లావాదేవీలు జరిగే పెట్రోల్ బంకులు, వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు, షాపింగ్ మాల్స్ సిబ్బందిని సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. తమ వద్ద నగదు లేదని, బంధువు లేదా స్నేహితుడు ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపిస్తాడని నమ్మబలికి, ఆ మొత్తాన్ని నగదుగా ఇవ్వాలని కోరుతున్నారు. ఇందుకు ప్రతిఫలంగా కొంత కమిషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. చిన్న మొత్తంలో అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో కొందరు అంగీకరిస్తున్నారు.

### ♦ ఖాతాలో పడేది డబ్బు కాదు... మోసపు ముద్ర

అయితే ఖాతాల్లోకి జమయ్యే ఆ డబ్బు చాలా సందర్భాల్లో సైబర్ నేరాల ద్వారా సేకరించినదేనని విచారణలో తేలుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మోసపోయిన బాధితులు ఫిర్యాదులు చేయడంతో సైబర్ క్రైమ్ విభాగం డబ్బు ప్రయాణాన్ని గుర్తించి సంబంధిత ఖాతాలను నిలిపివేస్తోంది. దీంతో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేకపోయినా డబ్బు స్వీకరించిన వ్యక్తులే ఇబ్బందుల్లో పడుతున్నారు.

### ♦ బ్యాంకుకు వెళ్తే బ్లాక్... పోలీస్ స్టేషన్‌కు వెళ్తే విచారణ

ఖాతాలో డబ్బు ఉన్నప్పటికీ లావాదేవీలు జరగకపోవడంతో బాధితులు బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ ఖాతా సైబర్ క్రైమ్ ఆదేశాల మేరకు హోల్డ్‌లో ఉందని తెలుసుకుని షాక్‌కు గురవుతున్నారు. అనంతరం పోలీసుల విచారణ, పత్రాల సమర్పణ, బ్యాంకు ప్రక్రియలు అంటూ వారాలు, నెలల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

### ♦ అమాయకులే టార్గెట్

ఆర్థిక ఇబ్బందులతో అదనపు ఆదాయం కోసం చూస్తున్న ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, యువకులే ఈ మోసాలకు ఎక్కువగా బలవుతున్నట్లు తెలుస్తోంది. సైబర్ నేరగాళ్లు వారి అవసరాలను ఆసరాగా చేసుకుని వల విసురుతున్నారు. కమిషన్ పేరుతో ప్రారంభమైన లావాదేవీ చివరకు చట్టపరమైన చిక్కులకు దారితీస్తోంది.

### ♦ అప్రమత్తతే రక్షణ

సైబర్ నేరాల నుంచి బయటపడాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అపరిచితుల కోసం వ్యక్తిగత ఖాతాల్లో డబ్బు స్వీకరించకూడదని, కమిషన్ పేరుతో నగదు మార్పిడులకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. డబ్బు మూలం తెలియనప్పుడు నగదు ఇవ్వడం ప్రమాదకరమని చెబుతున్నారు. అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

### ♦ ఏమంటున్నారు పోలీసులు?

"అపరిచితుల కోసం ఖాతాలను వినియోగించవద్దు. మీ ఖాతాలోకి వచ్చే ప్రతి రూపాయికి మీరు బాధ్యత వహించాల్సి ఉంటుంది. కమిషన్ కోసం చేసిన ఒక చిన్న తప్పిదం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి" అని జిల్లా సైబర్ క్రైమ్ అధికారులు సూచిస్తున్నారు.కొద్దిపాటి కమిషన్ కోసం చేసే ఒక లావాదేవీ... జీవితకాలం వెంటాడే సమస్యగా మారొచ్చు. ఖాతాలోకి వచ్చిన డబ్బు నిజంగా ఎవరిదో తెలుసుకోకుండా నగదు ఇవ్వడం అంటే తెలియకుండానే సైబర్ నేరగాళ్లకు సహకరించినట్టేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే అప్రమత్తతే రక్షణ... అవగాహనే ఆయుధం.



# శవాలపై సాగుతున్న... దందాకు అడ్డుకట్ట ఎప్పుడు..?

- కన్నీళ్లను క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు
- ఆసుపత్రి ఎదుటే ఆర్.ఆర్. అంబులెన్స్ సర్వీస్ హల్‌చల్‌పై ప్రశ్నలు
- రోజుల తరబడి నిలిచే వాహనాలు, ఐస్‌బాక్స్‌లపై అనుమానాలు
- కలెక్టర్ జోక్యంతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్న ప్రజలు




**కొత్తగూడెం, జూన్ 3 ( ప్రజాజ్యోతి )** మనిషి జీవితంలో అత్యంత విషాదకరమైన క్షణం కుటుంబ సభ్యుడి మరణం. అలాంటి సమయంలో బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాల్సిన వ్యవస్థే కొందరికి ఆదాయ వనరుగా మారిందన్న ఆరోపణలు కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిపై మళ్లీ చర్చకు దారితీశాయి. మృతదేహాల తరలింపు పేరుతో జరుగుతున్న వ్యవహారాలపై గతంలో పలుమార్లు విమర్శలు వచ్చినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని బాధితులు, ప్రజాసంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆర్.ఆర్. అంబులెన్స్ సర్వీస్‌కు చెందిన వాహనాలకే ప్రాధాన్యం లభిస్తోందన్న ఆరోపణలు నెలలుగా వినిపిస్తున్నాయి. మృతదేహాలను ఇతర వాహనాల్లో తరలించాలనుకునే కుటుంబాలకు పరోక్షంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఆసుపత్రి సేవలు ప్రజల కోసం ఉండాలే గానీ కొందరి వ్యాపార ప్రయోజనాలకు వేదికగా మారకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- ఆసుపత్రి ప్రాంగణంలో రోజుల తరబడి వాహనాలు.. ఐస్‌బాక్స్‌లు ఉండటంపై పలు అనుమానాలు

ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట, ఆసుపత్రి ప్రాంగణంలో ఆర్.ఆర్. అంబులెన్స్ సర్వీస్‌కు చెందిన వాహనాలు, ఐస్‌బాక్స్‌లు రోజుల తరబడి నిలిచి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రి వెలుపల రహదారిపై శాశ్వత స్థావరంలా ఈ సామగ్రి ఉండటానికి అనుమతులు ఉన్నాయా..? సంబంధిత అధికారులు దీనిపై ఎందుకు స్పందించడం లేదు..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒకే ప్రైవేట్ సంస్థకు చెందిన వాహనాలు, ఐస్‌బాక్స్‌లు నిరంతరం ఆసుపత్రి పరిసరాల్లో కనిపించడం వెనుక ఉన్న కారణాలపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- ఎంపిక హక్కు బాధిత కుటుంబాలదే కాదా..?

మృతదేహాల తరలింపునకు ఏ వాహనాన్ని వినియోగించుకోవాలన్నది పూర్తిగా కుటుంబ సభ్యుల నిర్ణయం కావాలని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. కానీ ఆసుపత్రి పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులు ఆ స్వేచ్ఛను పరిమితం చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలను ఆసుపత్రి యాజమాన్యం బహిరంగంగా ప్రదర్శించాలని ప్రజలు కోరుతున్నారు.

- బాధలో ఉన్న వారిపైనే అధిక భారమా..?

కుటుంబ సభ్యుడిని కోల్పోయిన వారు ఆ సమయంలో ధరల గురించి బేరమాడే పరిస్థితిలో ఉండరు. ఇదే బలహీనతను కొందరు అవకాశంగా మలుచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్య ఖర్చులతో ఇప్పటికే ఆర్థికంగా కుంగిపోయిన కుటుంబాలు, మృతదేహాల తరలింపుకూ అధిక మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం పేదలపై అదనపు భారంగా మారుతోందని ప్రజలు అంటున్నారు.

- కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటున్న ప్రజలు

జిల్లాలో అతిపెద్ద ప్రభుత్వ వైద్య సంస్థగా ఉన్న కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా మృతదేహాల తరలింపు సేవల విషయంలో పారదర్శక విధానం తీసుకురావడంతో పాటు, ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ సేవల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- విచారణతోనే వాస్తవాలు బయటపడతాయా..?

ఆర్.ఆర్. అంబులెన్స్ సర్వీస్‌కు సంబంధించిన ఆరోపణలు, ఆసుపత్రి ఎదుట రోజుల తరబడి నిలిచి ఉండే వాహనాలు, ఐస్‌బాక్స్‌ల వ్యవహారంపై జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలన్న డిమాండ్ బలపడుతోంది. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు. బాధిత కుటుంబాల కన్నీళ్లను వ్యాపారంగా మార్చుతున్నారన్న ఆరోపణలకు ముగింపు పలకాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.








## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్





**భద్రాచలం టౌన్ , జూన్ 3 , ప్రజాజ్యోతి,** పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సై పి. తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ మరియు హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆటో యూనియన్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, సరైన నంబర్ ప్లేట్లు లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం వంటి ఉల్లంఘనలు తీవ్రమైన నేరాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, వేగంగా మరియు అజాగ్రత్తగా (ర్యాష్ డ్రైవింగ్) వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. వాహనాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన డ్రైవర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మినిస్టర్ హరీష్ రావు జన్మదిన వేడుకలు





**టేకులపల్లి, జూన్ 03, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్‌రావు పుట్టినరోజు సందర్భంగా ముత్యాలంపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో టేకులపల్లి మాజీ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలోమాజీ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, జాలాది అప్పారావు బానోత్ కిసాన్ నాయక్, లక్పతి, కుమ్మరి కిరణ్ కుమార్, లాలు నాయక్, బానోత్ నరేష్, ధర్మవతి శివకృష్ణ, తావూరియా నాయక్, బాలాజీ, మాలోత్ సురేందర్, మాజీ మహిళా మండల అధ్యక్షురాలు ఆమెడా రేణుక, నాగభూషణం, మాజీ కోఆప్షన్ సభ్యులు మౌలాన సాహెబ్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.